


అవి కొవిడ్ ఉధృతంగా ఉన్న రోజులు. వృద్ధుల మీద దాని ప్రభావం మరీ ప్రతికూలంగా ఉంటుందని భయపడుతున్న సందర్భం. ఒకవైపు మృత్యుభయం, మరోవైపు లాక్‌డౌన్. ఈ నేపథ్యంలో, అమెరికాలో చాలామంది వృద్ధులు డీలాపడిపోయారు. నా అనేవారు లేని, మీరెలా ఉన్నారనే పలకరింపే వినిపించని... ఒంటరితనం వారిది. ఇలా ఉంటే కుక్కనో పిల్లినో పెంచుకుందామా అంటే దానిని చూసుకోలేని అలసట. ఈ పరిస్థితిని గమనించిన అలబామా రాష్ట్రంలోని ప్రభుత్వ అధికారులు వారి స్పర్శకు, మాటకు స్పందించే చిన్నచిన్న రోబోలను రూపొందించి ఇచ్చారు. ఈ సాయంతో ఆ వృద్ధుల జీవితాల్లో ఒంటరితనం చాలావరకు తగ్గినట్టు తేలింది. ఇది జరిగి చాలా రోజులు గడిచింది. ఇప్పుడు కొవిడ్ లేకపోవచ్చు. కానీ మనుషుల మధ్య లాక్‌డౌన్ మాత్రం అంతకంటే తీవ్రంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. నాలుగు గోడల మధ్య... కంప్యూటర్ సంకెళ్లు తగిలించుకుని, టార్గెట్ల మీద చూపులు బిగించిన లాక్‌డౌన్ ఇది. ఇంట్లో భౌతికంగా ఉన్నా, మెదడును మొబైల్లో దూర్చేసిన లాక్‌డౌన్ ఇది. ఆవేదన వస్తే ఆత్మహత్యే శరణ్యమనీ, పరాజయంలో బతుకు నుంచి పలాయనమే మంత్రమనీ దిక్కుతోచని లాక్‌డౌన్ ఇది. మనసుకు పట్టిన ఈ మబ్బు వీడాలంటే... మనిషికి మనిషి తోడును గుర్తించాలి. అందుకు అనువైన సమయం ఫ్రెండ్‌షిప్ డే!

... కె.ఎల్. సూర్య